యుద్ధం వద్దే వద్దు!

- ఉగ్రవాదులపై పోరు మానవాళికి మేలు
- రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ సూచన

-వార్త మెయిన్‌లో

విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

సోమవారం 5, మే 2025 | 8 పేజీలు

7న నారా లోకేష్ సత్యవేడు రాక

విశాలాంధ్ర-సత్యవేడు: రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ రెండు రోజుల పర్యటన నిమిత్తం సత్యవేడుకు రానున్నారు. మే 7, 8 తేదీల్లో మంత్రి నారాలోకేష్ సత్యవేడులో పర్యటించను న్నారు. ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేష్ కార్యకర్తలతో సమావేశం, బస ఏర్పాట్లు కోసం ఆదివారం షాప్ చైర్మెన్ రవినాయుడు, నియోజకవర్గ పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు, సమన్వయకర్త డాక్టర్ శ్రీపతి బాబు బృందం సీఐ మురళినాయుడు, స్థానిక టిడిపి నేతలతో కలిసి వారపు సంత స్థలాన్ని పరిశీలించారు. సంత స్థలంలో ఉన్న గుంతలను పూడ్చి చదును చేయాలని సూచించారు. ప్రధానంగా మే 7వ తేదీన వివిధ సమస్యలపై ప్రజల నుంచి మంత్రి నారా లోకేష్ వినతుల స్వీకరిస్తారు. దీంతోపాటు నియోజకవర్గంలోని టిడిపి నేతల ముఖ్యులతో సమావేశం నిర్వహించి ఇటీవల చోటు చేసుకున్న కొన్ని పరిణామాలపై నాయకుల అభిప్రాయాలు తెలుసుకోవడంతో పాటు దిశా నిర్దేశం చేయనున్నారు. కార్యకర్తలకు అండగా, ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని యువగళం పాదయాత్రలో మంత్రి నారాలోకేష్ ఇచ్చిన ఆమె మేరకు ఈ నెల7వ తేది -2లో

పల్లె ఖజానా పక్కదారి...

- ప్రభుత్వ నిధులు కార్యదర్శి ఖాతాలోకి
- కానరాని కీలకమైన రికార్డులు
- యాదమరి మండలంలో నిర్వాకం

విశాలాంధ్ర-వెదురుకుప్పం: గ్రామ పంచాయతీల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం నిధులు వెచ్చించి పల్లెల్లో వెలుగులు నింపాలనే లక్ష్యానికి అక్కడక్కడా నిధులు పక్కదారి పట్టిస్తూ మచ్చ తెస్తున్న దుస్థితి. పంచాయితీ ల్లో కొందరు కార్యదర్శుల అవినీతి అక్రమాలు, నిధుల దుర్వినియోగం అక్కడక్కడా వెలుగులో కి వస్తున్నాయి. మండల స్థాయి లో పర్యవేక్షణ లోపమా లేక ఉదాసీనత కారణమా తెలీదుగానీ క్షేత్ర స్థాయి లో ప్రజాధనం కాజేస్తున్న పరిస్థితులు దాపురించి అభివృద్ధి కుంటుపడుతుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలేం జరిగిందంటే.. చిత్తూరు జిల్లా యాదమరి మండలంలోని 14 కండ్రిగ యం డబ్ల్యూ పంచాయతీ నిధులు పక్కదారి పట్టినట్లు స్థానికులు బహిరంగ ఆరోపణలు చేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంభందించిన రికార్డుల నిర్వహణ లో కార్యదర్శి పూర్తి గా అలసత్వం వహించినట్లు తెలుస్తోంది. కీలకమైన రికార్డులు లేవని చెబుతున్నారు. నిజానికి సాధారణ నిధులు ,15 వ ఆర్థిక సంఘం నిధులు నుండి నిబంధనలు ఉల్లంఘించి పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ వ్యక్తిగత ఖాతాకు 1,48,827 రూపాయలు జమచేసినట్లు, అలాగే ఆయన తల్లి సుగుణ ఖాతా కు 2,51,912 రూపాయలు మళ్లించినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. అంతేకాకుండా 6-10-2024 వ తేదీ నుంచి ఇప్పటి వరకు నిధుల ఖర్చులకు సంభందించి బిల్లులు,రసీదులు సమర్పించలేదని చర్చలు సాగుతున్నాయి. ఏదిఏమైనా పంచాయతీ నిధుల దుర్వినియోగం పై సమగ్రమైన విచారణ జరిపి బాద్యులైన వారిపై తగుచర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయమై స్థానిక ఎంపిడిఓ వేణు వివరణ కోరగా మండలంలోని 14 కండ్రిగ యం. డబ్ల్యూ పంచాయతీలో నిధుల దుర్వినియోగం మా దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయమై పర్యవేక్షణ చెయ్యడం జరిగిందన్నారు. పంచాయతీ నిధుల దుర్వినియోగంపై జిల్లా పంచాయతీ అధికారుల దృష్టిలో ఉంది,వారి విచారణ అనంతరం చర్యలు వుంటాయని వివరించారు.

ప్రశాంత వాతావరణంలో నీట్ యుజి -2025 పరీక్షలు

- చిత్తూరులో నీట్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ - తిరుపతి నగర పరిధిలో నీట్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన డిఆర్ఓ

విశాలాంధ్ర-చిత్తూరు/తిరుపతి: జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలో ఆదివారం నీట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. ఎక్కడ ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా అధికార యంత్రాంగం ముందస్తు ఏర్పాటు చేపట్టింది. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. నగరంలో పివికేఎన్ డిగ్రీ కాలేజీ, సావిత్రమ్మ మహిళడిగ్రీ కాలేజీ లో ఈ పరీక్షలు జరిగాయి. ఈ రెండు కేంద్రాల్లో పరీక్షలు తీరును జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్ స్వయంగా పరిశీలించారు. ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రంలోకి అనుమతించారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రతి కేంద్రం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. విద్యార్థుల సెల్ ఫోన్లు భద్రపరచుకోవడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. పివికే డిగ్రీ కాలేజీలో జరిగిన పరీక్షకు 432 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 413 మంది హాజరయ్యారు. సావిత్రమ్మ మహిళా డిగ్రీ కాలేజీలో జరిగిన పరీక్షకు 278 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 264 మంది హాజరయ్యారు. ఈ పరీక్షల సందర్భంగా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ మార్గం గుండా వాహనాలు రాకపోకల సైతం దారి మళ్లించారు. విద్యార్థులు తల్లిదండ్రుల కోసం ప్రత్యేకంగా షామియాలతో పాటు తాగునీటి సదుపాయం కల్పించారు. మొత్తం మీద జిల్లా కేంద్రంలో ఈ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

తిరుపతి జిల్లాలో ఆదివారం నీట్ యూజీ- 2025 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిసాయని జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు పేర్కొన్నారు. నేటి ఆదివారం నిర్వహించిన నీట్ -2లో

లోకేష్ సత్యవేడు రాక

(మొదటి పేజీ తరువాయి) సత్యవేడు నియోజకవర్గ కేంద్రానికి రానున్నారు. మే 8వ తేదీన శ్రీసిటీలో ఎల్జి కంపెనీకి మంత్రినారా లోకేష్ భూమిపూజ చేయనున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మండలాధ్యక్షులు పరమశివం, ప్రభుత్వ ఆసుపత్రి అసోసియేషన్ సభ్యులు హేమభూషణం, టిడిపి నాయకులు శివానందం, సురేంద్ర, కుబేర్దన్, డివిఎంసి సభ్యులు గుత్తి త్యాగరాజులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీట్ పరీక్ష

(మొదటి పేజీ తరువాయి) యూజీ- 2025 పరీక్షల నిర్వహణ సరళిని ఎస్ జి ఎస్ ఆర్ట్స్ కాలేజీ, పద్మావతి డిగ్రీ మరియు పీజీ కళాశాల సెంటర్లను డిఆర్వో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో మొత్తం 4445 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా అందులో 4333 మంది హాజరయ్యారని 112 మంది గైర్హాజరయ్యారని, వెరసి మొత్తం 97.48 శాతం హాజరయ్యారని డిఆర్ఓ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో మొత్తం పది ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు జరిగిందనీ, పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించి కట్టుదిట్ట భద్రత ఏర్పాటు చేయడం జరిగిందనీ, పోలీసు సిబ్బంది పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేసారని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు మౌలిక వసతులైన టాయిలెట్స్, త్రాగునీరు ఉండేలా ఏర్పాటు, పరీక్షా కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్.టి.సి బస్సులను ఉదయము మరియు సాయంత్రం సమయాలలో అందుబాటులో ఉంచడం జరిగిందనీ, ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య సిబ్బంది తో క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్ష కేంద్రాల వద్ద జనం గుమి కూడకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. పరీక్ష జరుగు కేంద్ర సమీపంలో ఎక్కడ కూడా జిరాక్స్ కేంద్రాలు లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందనీ తెలిపారు.తిరుపతి జిల్లాలోని పది పరీక్ష కేంద్రాలు :1. శ్రీ పద్మావతి గర్ల్స్ హై స్కూల్, వెస్ట్ చర్చి రోడ్, బాలాజీ కాలనీ, తిరుపతి. 2. పీఎం కేంద్రీయ విద్యాలయ నెంబర్ 1, తిరుపతి, హరే కృష్ణ రోడ్, యంసిఆర్ కాలనీ, తిరుపతి 3. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (ఉమెన్స్ యూనివర్సిటీ) శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఎగ్జామినేషన్ హాల్, పద్మావతి నగర్, తిరుపతి 4. ఎస్.జి.ఎస్ ఆర్ట్స్ కాలేజ్ (అటానమస్) నియర్ లక్ష్మీపురం సర్కిల్ తిరుచానూర్ రోడ్, తిరుపతి5. శ్రీ పద్మావతి ఉమెన్స్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ (టీటీడీ) వింగ్ -ఏ, ఎస్ వి యూనివర్సిటీ నియర్ శ్రీ పద్మావతి గెస్ట్ హౌస్ తిరుపతి 6. శ్రీ పద్మావతి ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ అండ్ పీజీ కాలేజ్ (టిటిడి) వింగ్ - బి, ఎస్ వి యూనివర్సిటీ పద్మావతి గెస్ట్ హౌస్ తిరుపతి 7. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ క్యాంపస్ హై స్కూల్, వెస్ట్ చర్చి రోడ్డు, బాలాజీ కాలనీ తిరుపతి 8. శ్రీ వెంకటేశ్వర జూనియర్ కాలేజ్ (టిటిడి) నియర్ సంస్కృత విద్యాపీఠం, ఎల్ఐసి రోడ్, బాలాజీ కాలనీ తిరుపతి 9. ఎస్ వి ఆర్ట్స్ కాలేజ్ (టిటిడి) వింగ్ ఏ, ఎస్ వి ఆర్ట్స్ కాలేజ్ (టీటీడీ) వింగ్ - ఏ, బాలాజీ కాలనీ తిరుపతి 10. డి ఆర్ డబ్ల్యు జూనియర్ కాలేజ్, గూడూర్, జడ్పీ హైస్కూల్ రోడ్, గూడూరు.

గంగజాతరలో మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గంగవరం: మండలంలోని గండ్రాజు పల్లి గ్రామంలో ఆదివారం జరిగిన గంగమ్మ జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ శాసనసభ్యులు వెంకటే గౌడ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు సుఖ సంతోషాలతో జీవనం సాగించాలని గంగమ్మతల్లిని ప్రార్థించారు. అమ్మవారి దర్శనం తర్వాత ఆలయ ముందు నైవేద్యం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, పార్టీ అభిమానులు, కార్యకర్తలతో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

చిత్తూరులో భారీ వర్షం

విశాలాంధ్ర-చిత్తూరు: జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు ఉరుములు మెరుపులు గాలితో కూడిన వర్షం పడింది. కొద్దిరోజులుగా ఎండ వేడిమికి ఉక్కిరి బిక్కిరి అవుతున్న నగరవాసులకు ఈ వర్షం కొంత సేద నిచ్చింది. అయితే భారీగా పెను గాలులతో కూడిన వర్షం పడడంతో పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరం ఏర్పడింది. అలాగే నగరంలో పలు ప్రాంతాల్లో రహదారులన్నీ జలమయ్యాయి. డ్రైనేజీ కాలవలు పొంగి ప్రవహించడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. నగరంలో పలుచోట్ల గాలివానకు పడిపోయిన చెట్లను నగరపాలక సిబ్బంది హుటాహుటిన తొలగించే పనులు చేపట్టారు. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది రంగంలోకి దిగి విద్యుత్తును పునరుద్ధరించే పనులు చేపట్టారు.

ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు
రూ.1.50 కోట్లు విరాళం

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: బెంగుళూరుకు చెందిన సుయుగ్ వెంచర్స్ ఎల్ఎల్పీ సంస్థ చైర్మన్ యతీష్ సూరినేని ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు ఆదివారం రూ.1.50 కోట్లు విరాళంగా అందించారు. ఈ మేరకు తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు విరాళం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా దాతను చైర్మన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామ కృష్ణ పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ క్రీడలో ఉత్తమ ప్రదర్శన

విశాలాంధ్ర-చిల్లకూరు: అంతర విశ్వవిద్యాలయాల క్రీడలలో టేబిల్ టెన్నిస్ విభాగంలో వల్లిపేడు గ్రామానికి చెందిన పార్థివక్రిష్ణ తమ బృందంతో కలసి అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి విజయం సాధించారు. ఈ విజయంతో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జరగబోయే జాతీయ విశ్వవిద్యాలయాల క్రీడా పోటీలకు ఎంపిక కావడం జరిగింది. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ వెటర్నరీ కళాశాలలో నాలుగవ సంవత్సరం విధ్యాభ్యాసం చేస్తున్న పార్థివక్రిష్ణను పలువురు అభినందించారు. మండల తెలుగుదేశం పార్టీనాయకులు ముచ్చకాల నందకుమార్ కుమార్తె కావడంతో పలువురు అభినందించి, ఉత్తరప్రదేశ్ లో జరగబోయే పోటీలలో సత్తా ప్రదర్శించి విజయశిఖరాలను అదిరోహించాలని ఆకాంక్షించారు.

విద్యుదాఘాతానికి గురైన జూనియర్ లైన్ మెన్

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలంలోని చిగురువాడ పంచాయతీ సంస్కృతనగర్‌లో ఆదివారం మధ్యాహ్నం జరిగిన దుర్ఘటన స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. గాలి వానతో చెట్లు విరిగి గగన్ అపార్ట్మెంట్ సమీపంలోని ట్రాన్స్ ఫార్మర్ పై పడటంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో విద్యుత్ శాఖకు చెందిన జూనియర్ లైన్ మెన్ మురళి సమస్య పరిష్కరించేందుకు ట్రాన్స్ ఫార్మర్ పైకి ఎక్కారు.అయితే, అక్కడ ఉన్న 33/11 కేవీ లైన్ అనుకోకుండా తగలడంతో మురళికి తీవ్రంగా కుడిచేయి,కాలు కాలిపోయాయి. అక్కడే ఉన్న తీవ్ర గాయాలతో ఇనుపరాడ్లపై పడిపోయారు. సంఘటనను గుర్తించిన స్థానికులు వెంటనే స్పందించి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సమాచారం అందుకున్న సబ్‌స్టేషన్ సిబ్బంది అతికష్టంగా మురళిని కిందకు దించి, 108 ద్వారా అతన్ని స్విమ్స్‌కు తరలించారు.అనంతరం మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రికి రిఫర్ చేశారు.ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. జూనియర్ లైన్ మెన్ మురళి రామచంద్రాపురం మండలం రాయలచెరువు గ్రామానికి చెందినవారు. ప్రస్తుతం చిగురువాడ సచివాలయ పరిధిలో జూనియర్ లైన్ మెన్ గా విధులు నిర్వహిస్తున్నారు.ఆయనకు భార్య, ధైర్య మూడు నెలల పాప ఉన్నారు. ఈ ఘటనపై పలువురు స్థానికులు, సహోద్యోగులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మురళికి అతి త్వరగా పూర్తి ఆరోగ్యం లభించాలని వారు ఆకాంక్షిస్తున్నారు.

జిఎన్ఆర్‌ను గజమాలతో సత్కరించిన పప్పు

విశాలాంధ్ర-వెంకటగిరి: వెంకటగిరి పట్టణంకు చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ పెంచల కోన దేవస్థానం చైర్మన్ గంగోడు నాగేశ్వర రావు నెల్లూరు జిల్లా డి. సి. యం.ఎస్ చైర్మన్ గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వెంకటగిరి మండల పార్టీ అధ్యక్షులు పప్పు చంద్ర మౌళి రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆయన నివాసం లో టీడీపీ రూరల్ నాయకులు, యూనిట్ ఇంచార్జిలు, బూత్ కన్వీనర్లు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్య లో పాల్గొని గజ మాలతో ఆయన్ని సన్మానించారు. ఈ సందర్భంగా పప్పు చంద్రమౌళి రెడ్డి మాట్లాడుతూ జి. ఎన్. ఆర్ సోషల్ ట్రస్ట్ తరపున వెంకటగిరి నియోజకవర్గం లో అంబులెన్స్, పేదలకు విద్య, వైద్యం వినూత్న సేవలతో పాటుగా, క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న గంగోటి నాగేశ్వరావు సేవలు అభినందని యమన్నారు. టీడీపీ పార్టీ సీనియర్ నాయకులు గా పార్టీ విజయానికి ఎప్పుడు అండగా ఉండగా ఉంటారని తెలిపారు. అలాగే భవిష్యత్లో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రూరల్ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు బాతులకాపరి దుర్మరణం

విశాలాంధ్ర-చిల్లకూరు: మండలపరిధిలోని కాకువారిపాళెం గ్రామంలో ఆదివారం సాయంత్రం అకస్మాత్తుగా పిడుగుపాటుకు గురై బాతులకాపరి మునీంద్ర(30) ప్రాణాలు కోల్పోయారు. చనిపోయిన మునీంద్ర వాకాడు మండలవాసి అని ఎస్టీ యానాది అని స్థానికులు తెలిపారు. మునీంద్ర మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. తహశీల్దార్ శ్రీనివాసులు మరియు ఎస్ఐ సురేష్ బాబు పరిస్థితి సమీక్షించారు. తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అకాలవర్షంతో బల్లవోలు గ్రామంలో వరి ధాన్యం నీటిపాలు

200 ఎకరాలలో అపారనష్టం.. అంతా సన్నచిన్నకారురైతులే

ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలన్న ఉపసర్పంచ్ వినయ్ రెడ్డి

విశాలాంధ్ర-చిల్లకూరు: అకస్మాత్తుగా ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షంతో బల్లవోలు గ్రామంలో షుమారు 200 ఎకరాలలో వరిపంటను కోసి కళ్ళాలలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న వరిదాన్యం నీటిపాలవ్వడంతో రైతులను నిశ్చేష్టులను చేసింది. అందరూ సన్నా, చిన్న కారు రైతులే. పట్టలను కప్పినా ఈదురుగాలులు ఉధృతంగా రావడంతో పట్టలు ఎగిరి పోయాయని రైతులు తెలిపారు. బల్లవోలు గ్రామ ఉపసర్పంచ్ దువ్వూరు వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మండల తాహాశీల్దారును బల్లవోలు గ్రామానికి తీసుకుని వచ్చి క్షేత్ర స్థాయిలో నష్టపోయిన పంటను మరియు రైతులను చూపించి, నష్టపోయిన రైతులను ప్రభుత్వ పరంగా పరిహారం వచ్చే విదంగా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కంచి పీఠం స్వాములకు ఘన స్వాగతం

విశాలాంధ్ర-పుత్తూరు: కంచి పీఠం స్వాములకు పుత్తూరులో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా స్వాగతం పలికారు. ఇటీవల కంచి కామకోటి పీఠం ఉత్తరాధికారిగా పట్టాభిషిక్తులైన శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామీజీ వారు గురువుగారైన శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి వారితో కలిసి మొట్టమొదటిగా శ్రీవారి దర్శనార్థమై తిరుపతికి విచ్చేశారు. ఈ సందర్భంగా పుత్తూరు శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సంఘం వారు తిరుపతి చెన్నై జాతీయ రహదారిలోని (మలేషియా మురుగన్) శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద పూర్ణకుంభం తోఘన స్వాగతం పలికారు. దైవభక్తి సంస్కృతి సంప్రదాయాలు, కాపాడుతున్న కంచిపీఠం ఎందరు ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచిందని, ఈ సందర్భంగా స్వాములు వారు మొట్టమొదటిసారిగా పుత్తూరు ప్రాంతానికి రావడం ఇటు నుంచి తిరుపతికి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకోవడానికి వెళుతూ మాకు అనుగ్రహ దర్శనం కల్పించడం చాలా ఆనందదాయకమని పుత్తూరు పట్టణంలోని ప్రజలు బ్రాహ్మణ సంఘంసభ్యులు భక్తులు ఆసంఘ గౌరవాధ్యక్షులు ఆలూరి రామకృష్ణ తెలియజేశారు. ఈ సందర్భంగా స్వామి వారు పుత్తూరు బ్రాహ్మణ సంఘం వారి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు గాయత్రీ బ్రాహ్మణ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బంగారు ఉంగరం సొంతదారునికి అందజేసిన ఆలయ కమిటీ

విశాలాంధ్ర-రామకుప్పం: మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం లో మార్చి 30 న శాంతిపురం మండలానికి చెందిన ప్రవీణ్ కుమార్ అనే భక్తుడు ఆలయంలో దర్శనానికి వచ్చి బంగారు ఉంగరం పోగొట్టుకున్నాడు అయితే ఆలయం లో వెదికిన దొరకలేదని ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించి ఉంగరం దొరికిన ఎడల దయచేసి సమాచారం ఇవ్వాలని కోరాడని ఈ సందర్భంగా ఆదివారం సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలోపల వినాయక స్వామి విగ్రహం వద్ద పడి ఉండడాన్ని అర్చకులు వాసు స్వామి గమనించారు ఆయన వెంటనే ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు సీతాపతికి స్వామి కి అందజేశారు అనంతరం బాధితుడు ప్రవీణ్ కుమార్ కు పోలీసుల సమక్షంలో బంగారు ఉంగరాన్ని అప్పగించడం జరిగిందని కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మరియు రామచంద్రప్ప, కృష్ణమూర్తి, పోలీసులు తదితరులు పాల్గొన్నారు

నాగేశ్వర యాదవ్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర-తిరుపతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యాదవ సాధికారిక సమితి అధ్యక్షులు కర్నూల్ డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వర యాదవ్ చిత్తూర్ జిల్లా పార్టీ కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా ఆదివారం నాడు జిల్లా యాదవ సాధికారిక సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు పలు అంశాలపై చర్చించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్ గుర్రప్ప యాదవ్ గ్రామ కమిటీ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

5 లక్షల ఆస్తి నష్టం.. కట్టుబట్టలతో నిరాశ్రయులైన కుటుంబం

విశాలాంధ్ర-చిల్లకూరు: మండలపరిధిలోని బల్లవోలు గ్రామంలో ఆదివారం ఉదయం పిట్టల నాగభూషణం అనే వ్యక్తి పూరిల్లు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా అగ్నికి అహుతి అయ్యి దగ్ధమైంది. బాధిత కుటుంబం నిరాశ్రయులై కట్టుబట్టలతో మిగిలారు. బల్లవోలు గ్రామ ఉప సర్పంచ్ దువ్వూరు వినయ్ కుమార్ రెడ్డి భాదిత కుటుంబానికి తక్షణ సాయంగా 5 వేల రూపాయల నగదును అందచేసారు. అకస్మాత్తుగా ఈ దుర్ఘటన జరగడం దురదృష్టమని తమ విచారం మరియు ఆవేదనవ్యక్తంచేశారు. ఉపసర్పంచ్ వినయ్ రెడ్డి. విషయాన్ని మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ గూడూరు నియోజకవర్గ ముఖ్యనాయకులు తానంకి నానాజీ మరియు ప్రియతమ శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ ల దృష్టికి తీసుకుని వెళ్ళండం జరిగిందిఅని ప్రభుత్వం పరంగా పక్కా ఇల్లు మంజూరు చేయించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. తహశీల్దార్ శ్రీనివాసులు ద్వారా తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ స్పందించి తగు చర్యలుతీసుకోవాలని, భాదిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

వడదెబ్బ గురైన వ్యక్తిని పరామర్శించిన రాకేష్ కిరణ్

విశాలాంధ్ర-పుత్తూరు: నారాయణ వనం నారాయణవనం మండలంలోని దిగువ కనకంపాలెం దళిత గ్రామానికి చెందిన తోటి రాజయ్య ఇంటికి అవసరమైన సరుకులు కొనుగోలుకు పుత్తూరు పట్టణానికి వెళ్లి ఇంటికి కావలసిన నిత్యవసర సరుకులు తీసుకొని తిరుగు ప్రయాణంలో మరాఠ గేటు వద్ద వడదెబ్బ సోకి స్పృహ తప్పి పడిపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం స్థానికులు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన పుత్తూరు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి హాస్పిటల్ కు వచ్చి చికిత్స అనంతరం డాక్టర్ సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం నగిరి ఏరియా హాస్పిటల్ చికిత్స నిమిత్తం వెళ్లడం జరిగింది సమాచారం అందుకున్న ఉమ్మడి జిల్లా వైసిపి క్రియాశీల కార్యదర్శి టి రాకేష్ కిరణ్ వడదెబ్బకు గురైన తోటి రాజయ్య ఆయన్ను పరామర్శించి మెరుగైన వైద్యం కోసం డాక్టర్లతో మాట్లాడడం జరిగింది వడదెబ్బకు గురైన రాజయ్యకు వారి కుటుంబ సభ్యులకు అధైర్య పడవద్దని అన్ని విధాల ఆదుకుంటామని మరోసారి ఇచ్చారు ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నదొరై అశోక్ పీజీ బాబు గోవిందస్వామి వర్మ అరుణాచలం మురుగవెల్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయ కుంభాభిషేకంలో ప్రజాప్రతినిధుల సందడి

విశాలాంధ్ర-గుడిపాల: గుడిపాల మండలం, పాపసముద్రం పంచాయతీ పరిధిలోని పిల్లారి కుప్పంలో నూతనంగా నిర్మించిన ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో ఆదివారం కుంభాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ హాజరై, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు టిడిపి నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు, దేవుని ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే తెలిపారు, కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్, తెలుగు యువత అధ్యక్షుడు ఎంపీటీసీ హరిప్రసాద్, సర్పంచ్ చిట్టిబాబు, టిడిపి నాయకులు గణేష్, అర్జున్ పయని, గజేంద్ర, రవి నాయుడు, బాల హైజాక్ గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు,అదే విధంగా చిత్తూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జ్ విజయానంద్ రెడ్డి కూడా ఆలయాన్ని సందర్శించి పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు, ఆలయ పెద్దలు, సర్పంచ్ చిట్టిబాబు తదితరులు స్వాగతం పలికారు, ఈ కార్యక్రమంలో సర్పంచులు చిట్టిబాబు, రజనీకాంత్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

తల్లిదండ్రులు పిల్లలపట్ల కాస్త నిగ్రహం పాటించాలి

ఈశ్వర వాక శివ కోటీశ్వర రెడ్డి

విశాలాంధ్ర-చంద్రగిరి: తల్లిదండ్రులారా తమ పిల్లల పరీక్ష ఫలితాలు పై కాస్త నిగ్రహం పాటించాలని విద్యాధుకుడు జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్, సంఘ సేవా తత్పరుడు ఈశ్వర వాక శివ కోటీశ్వర రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షలు చదువులో ఒక భాగమని, చదువు జీవితంలో ఒక భాగం, జీవితమే చదువు కాదు, పరీక్షలే చదువు కాదు. అంతేకాకుండా అతి ముఖ్యంగా విద్యార్థి యొక్క జ్ఞానానికి, పరిజ్ఞానానికి పరీక్షలు కొలమానం కాదు, కాకూడదు. ఒకే విద్యార్థి రాసిన ఒకే జవాబుకి ఒక్కొక్క టీచర్ ఒక్కో రకంగా రెస్పాండ్ అయి కరెక్షన్ చేసి మార్కులు ఇవ్వచ్చు. అంటే దీన్ని బట్టి మనకేం అర్థమవుతుంది విద్యార్థి ఎంత బాగా రాసినా ఆ ఉపాధ్యాయుడు యొక్క మెదడులో ఆ జవాబు ఏ రకంగా ఉండాలి అని ఫిక్స్ అయ్యి ఉంటాడు. ఆ రకంగానే మార్కులు పడతాయి. కాబట్టి తల్లిదండ్రులు గురువులు ఈ సమయంలో విద్యార్థులకి బాసటగా నిలవాలి. సపోర్ట్ ఇవ్వాలి. ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులు. ఫలితాలను మీ పిల్లలని పక్కన కూర్చోబెట్టుకొని చూడండి వాళ్ళని ఒంటరిగా ఫలితాల కోసం బయటికి పంపించకండి. అంతే కాదు ఇంట్లో కూడా ఒక రూమ్‌లో కూర్చొని ఒంటరిగా ఫలితాలు చూసే పరిస్థితిని వారికి కల్పించకండి. మీరు పక్కన కూర్చొని ఫలితాలను చూపించండి. వారికి ధైర్యం ఉంటుంది. ఫలితాలు రావడానికి ముందే పిల్లల్ని మెంటల్‌గా ప్రిపేర్ చేయండి. ఎన్ని మార్కులు వచ్చినా, నువ్వు పై చదువులు చదవాల్సిందే. ఆ పై చదువులకి నీ మార్కులు ఎందుకు పనికిరావు. కాబట్టి ఎన్ని మార్కులు వచ్చినా పర్వాలేదు. నువ్వు నేర్చుకున్న జ్ఞానమైతే ఎక్కడికి పోదు కదా.. అని వారిని ప్రిపేర్ చేసి పెట్టండి. ఒకవేళ 1 లేక 2 సబ్జెక్ట్స్ ఆగిపోయినా కూడా పెద్ద ప్రమాదమేమీ లేదు. పది రోజుల్లో మళ్ళీ అడ్వాన్స్ సప్లమెంటరీ ఎగ్జామ్స్ ఉన్నాయి. అవి రాస్తావ్, నీ ఫ్రెండ్స్ అందరితో పాటు మళ్ళీ నువ్వు పై చదువులకి వెళ్తావు అని వారిని ఎంకరేజ్ చేయండి.కానీ మీ పిల్లలను ఎక్కడ కూడా దయచేసి నిరుత్సాహపరచవద్దు,ఒంటరిగా వదిలేయొద్దు. ఎందుకంటే ఈ పరీక్ష పోతే మరో పరీక్ష ఉంది కానీ తప్పుడు నిర్ణయం తీసుకుంటే జీవితాన్ని బలి చేసుకుంటే మరో జీవితం లేదు. ఇది తల్లిదండ్రులు, విద్యార్థులు, గురువులు అందరు గుర్తుపెట్టుకోవాలి. ముఖ్యంగా గురువులకు సూచన.



అద్భుతమైన మార్కులు వచ్చిన విద్యార్థులను మీరు విష్ చేసినా, చేయకపోయినా వాడు సంతోషంగానే ఉంటాడు. ఎవరైతే ఫెయిలయ్యారో, ఎవరికి అయితే తక్కువ మార్కులు వచ్చాయో వారిని ఒక్కసారి వెళ్లి కలవండి. నేరుగా కలిసే వీలు లేకపోతే కనీసం ఫోన్ చేసి మాట్లాడండి. నువ్వు చాలా బాగా చదువుతావ్, ఎక్కడో ఏదో తప్పు జరిగింది అందుకే తక్కువ వచ్చాయి ఫెయిల్ అయ్యావు. అయినా దీనితో పెద్ద నష్టమేమీ లేదు ఒక పది రోజుల్లో అడ్వాన్స్ సప్లిమెంటరీ ఎగ్జామ్స్ ఉన్నాయి దానికి నేను నీకు గైడెన్స్ చేస్తాను. నువ్వు చాలా అద్భుతంగా పాస్ అవుతావు అని సపోర్ట్ చేయండి పిల్లల్ని ఎంకరేజ్ చేయండి. దయచేసి ఇదంతా తల్లిదండ్రుల గురువుల యొక్క బాధ్యత..ఇక విద్యార్థులకు చివరగా విన్నపం.పరీక్షలే జీవితానికి కొలమానాలు కాదు.నీకు ఏ రంగంలో ఇంట్రెస్ట్ ఉందో ఆ రంగంలో దృష్టి పెట్టు. ఖచ్చితంగా విజయం నీ పాదాక్రాంతమవుతుంది. అంతేగాని పరీక్షల ఫలితాలకు పొంగిపోకు, కృంగిపోకు. ఫలితం ఏదైనా నీ జ్ఞానం నీతోనే ఉందని గుర్తుపెట్టుకో. నీ జ్ఞానం నిన్ను ఉన్నత శిఖరాలను అధిరోహింపజేస్తుంది అని మర్చిపోకు. ఒక వార్డ్ మెంబర్ గా పది సార్లు ఓడిపోయిన అబ్రహం లింకన్ అమెరికా అధ్యక్షుడుగా గెలిచాడని తెలుసుకో ఫెయిల్ అయినంత మాత్రాన నీ జీవితం ఆగిపోతుందని అనుకోకు. నీకు బంగారు భవిష్యత్తు ముందుందని గుర్తుపెట్టుకో. దానికోసం శ్రమించు, జీవించు, ఆనందించు అంటూ వవిధ్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఆయన ఓ ప్రకటనలో విలువైన సందేశం పంపారు.

సమాధులకు సౌకర్యాలు కల్పించండి సారూ

విశాలాంధ్ర- బైరెడ్డిపల్లి :బైరెడ్డిపల్లి మండల కేంద్రానికి చెందిన సమాధులకు సౌకర్యాలు కల్పించాలంటూ మండల ప్రజలు తెలియజేస్తున్నారు. బైరెడ్డిపల్లి మరవంక దగ్గర ఉన్న హిందువుల సమాధులు అస్తవ్యస్తంగా ఉన్నాయని ఈ సమాధులకు గాను పరిసర ప్రాంతంలోని స్థలాన్ని కేటాయించి ప్రహరీ గోడను నిర్మించుకోవాలని విధులను మంజూరు చేయవలసిందిగా పలమనేరు శాసనసభ్యులు ఎన్ అమర్నాథ్ రెడ్డిని లిఖిత పూర్వకంగా విన్నవించుకోనున్నట్లు మండల ప్రజలు తెలియజేస్తున్నారు. ఈ ప్రాంతంలో మండలానికి చెందిన వ్యక్తులు స్వర్గస్తులైనట్లయితే సరైన సౌకర్యాలు లేవని రాత్రిపూటలలో సమాధులవద్దకు వెళ్లవలసి వస్తే దారి పొడుగునా విద్యుత్ దీపాలు లేనట్లు వారు తెలియజేశారు. చెరువులో నీళ్లు ఎక్కువ మరవ వచ్చినట్లయితే సమాధుల పైన ఉన్న మన్ను రాళ్లు కాస్త నీళ్లలో కొట్టుకు పోతున్నాయని. స్థలాన్ని సర్వే చేసి స్థలాన్ని సింహపురికి గాను కేటాయించి నట్లయితే బాగుండునని ఎన్ని కోట్లు సంపాదించినా చివరికి వెళ్లాల్సిందే ఆ స్థలానికే కాబట్టి ఆ స్థలాన్ని సౌకర్యవంతంగా చేసుకోవడం తమ బాధ్యత అని, సంబంధిత అధికారుల ద్వారా శాసనసభ్యుల సహాయ సహకారాలతో తీర్చిదిద్దుకోనున్నట్లు వారు తెలియజేశారు. చెరువుకు పడమర వైపున లింగాయతుల సమాధులు,గుండాల తోపులో గౌడు కులస్తుల సమాధులు (దీనికి దారి సమస్య ఉన్నది) మిట్టపల్లి కి వెళ్ళు దారిలో ఆచార్ల సమాధులు, సేట్ల సమాధులు, ఎయిర్టెల్ టవర్ వద్ద ఎస్సీల సమాధులు పుంగనూరు రోడ్డులో ముస్లింల సమాధులు ఉన్నాయి, వీటికి కూడా ఉన్న సమస్యలను తొలగించి శాసనసభ్యుల సహాయ నిధి నుంచి ఫండ్ ను కేటాయించి సహాయ సహకారాలు అందజేయాలని వారు ఈ సందర్భంగా తెలియజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర- బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992 -93 సంవత్సరానికి చెందిన విద్యార్థులు గెట్ టుగెదర్ పార్టీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ కలిసి సంతోషంగా గడపడం జరిగింది. ఇదేవిధంగా అప్పుడప్పుడు తమందరం కలుసుకుంటామని ఈ కార్యక్రమం తమకెంతో ఆనందాన్నిచ్చిందని పూర్వ విద్యార్థులు చిన్ని కృష్ణ సాదిక్ భాషా ఉమాశంకర్ రెడ్డప్ప తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలచంద్ర నాయుడు రామానాయుడు కుమారస్వామి, జయ చంద్రన్ దేవరాజులు నాయుడు పాల్గొన్నారు.

వడదెబ్బ గురైన వ్యక్తి

విశాలాంధ్ర-పుత్తూరు: నారాయణ వనం నారాయణవనం మండలంలోని దిగువ కనకంపాలెం దళిత గ్రామానికి చెందిన తోటి రాజయ్య ఇంటికి అవసరమైన సరుకులు కొనుగోలుకు పుత్తూరు పట్టణానికి వెళ్లి ఇంటికి కావలసిన నిత్యవసర సరుకులు తీసుకొని తిరుగు ప్రయాణంలో మరాఠ గేటు వద్ద వడదెబ్బ సోకి స్పృహ తప్పి పడిపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం స్థానికులు సమాచారం ఇవ్వడం తో కుటుంబ సభ్యులు హుటాహుటిన పుత్తూరు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి హాస్పిటల్ కు వచ్చి చికిత్స అనంతరం డాక్టర్ సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం నగిరి ఏరియా హాస్పిటల్ చికిత్స నిమిత్తం వెళ్లడం జరిగింది సమాచారం అందుకున్న ఉమ్మడి జిల్లా వైసిపి క్రియాశీల కార్యదర్శి టి రాకేష్ కిరణ్ వడదెబ్బకు గురైన తోటి రాజయ్య ఆయన్ను పరామర్శించి మెరుగైన వైద్యం కోసం డాక్టర్లతో మాట్లాడడం జరిగింది వడదెబ్బకు గురైన రాజయ్యకు వారి కుటుంబ సభ్యులకు అధైర్య పడవద్దని అన్ని విధల ఆదుకుంటామని మరోసారి ఇచ్చారు ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నదొరై అశోక్ పీజీ బాబు గోవిందస్వామి వర్మ అరుణాచలం మురుగవెల్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉచిత ఒడుగులు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: హజరత్ మహబూబ్ సుభాని రహ నిషాన్ ముత్తవల్లి షేక్ మిర్జాన్ సాహెబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఒడుగులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒడుగులు కార్యక్రమాన్ని డాక్టర్ అహమ్మద్ భాష వెంకటగిరి వాళ్లు వచ్చి పిల్లలకు ఒడుగులు చేశారు. ఈదులగుంట షాదీ మహల్లో ముస్లిం పిల్లలకు ఒడుగులు చేసిన పిల్లలకు పండ్లు బ్రెడ్ మందులు సరఫరా చేశారు. ఈ కార్యక్రమం గత 26 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని ముతవల్లి షేక్ మీర్జాన్ సాహెబ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ యాంటీ కరప్షన్ ప్రెసిడెంట్ లాలూ ఇస్మాయిల్, సెక్రెటరీ ఆరిఫ్, ఎక్స్ యాంటీ కరప్షన్ మీడియా ప్రెసిడెంట్ యాసిన్ , ఖాదర్ భాషా, ముజీబ్ సాదిక్ కాలేషా, సలీం తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో కుండపోత వర్షం

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలో ఆదివారం ఉరుములు , మెరుపు లు, ఈదురు గాలులతో తోకూడిన కుండపోత వర్షం కురిసింది.ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతం అయి గంట పాటు కుండ పోత వర్షం కురిసింది. దీంతో గూడూరు పట్టణంలోని పలు ప్రాంతాలు వర్షపునీరుతో జలమయమయ్యాయి అదేవిధంగా గూడూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో అకాల వర్షం కురిసింది

శిల్పారామంలో అలరించిన నృత్య ప్రదర్శనలు

విశాలాంధ్ర- తిరుపతి : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా స్థానిక తిరుచానూరు శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. నాట్యాచార్యులు గౌతమి మహేష్ శివార్పణం స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, చెన్నై వారి చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పుష్పాంజలి శ్రీ విఘ్న రాజం భజే అంటూ సాగే ఈ పాటతో మొదలై గణేష్ కవుతువం, అలరిప్పు, జాతీశ్వరం చక్రవాకం, శబ్దం, నాటకురుంజి వర్ణం, మూషిక వాహన, కోలాటం తదితర పాటలకు కళాకారులు సాయి కీర్తన రాజన్, పూజా, యజ్ఞిని శ్రీ, రజిత, నిహారిక, దివ్యదర్శిని, ధృతి, అభిరామి, పూజా రాణి, శ్రీయ, నిత్య శ్రీనివాసిని, యోమి, సంగీత తదితరులు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. ప్రేక్షకుల చిన్నారులను కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. కార్యక్రమం ఏర్పా ట్లను శిల్పారామం ఏ.ఓ.సుధాకర్ పర్యవేక్షించారు. అనంతరం ఏ.ఓ సుధాకర్ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో నృత్య శిక్షకురాలు గౌతమి మహేష్, రాధాకృష్ణ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి మహిళా నేత

దౌర్జన్యాలను నియంత్రించాలి

విశాలాంధ్ర -చిత్తూరు: పెనుమూరు మండలం మాజీ ఎంపీటీసీ అరుణకుమారి తమ పొలంలో దౌర్జన్యంగా రోడ్డు వేసి తమను నిత్యం వేధింపులకు పాల్పడుతున్నదని పెనుమూరు మండలం సామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉష, సుజన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం చిత్తూరు ప్రెస్ క్లబ్ నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ గంగాధర నెల్లూరు నియోజక వర్గం ఎమ్మెల్యే థామస్ పేరును వాడుకుని ఆయనకు చెడ్డ పేరు తెచ్చే విధంగా అరుణ కుమారి అక్రమాలకు పాల్పడుతున్నదని తెలిపారు. సర్వే రికార్డు ప్రకారం సామిరెడ్డిపల్లి గ్రామానికి అరుణ కుమారి ఆక్రమించుకున్న భూమిలో రోడ్డు మార్గం ఉందన్నారు. ఆమె భూమి రోడ్డుకు పోతుందనే బాధతో తమపై గ్రామస్తులను రెచ్చగొట్టి దౌర్జన్యంతో తమ పొలంలోని రోడ్డు వేయించారని ఆరోపించారు. అరుణ కుమారి దౌర్జన్యాన్ని ప్రశ్నించినందుకు తమపై తప్పుడు కేసులు పెట్టారని పేర్కొన్నారు.ఎమ్మెల్యే థామస్ వాస్తవాలను తెలుసుకుని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. అరుణ కుమారి ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతుందని వాపోయారు. గ్రామస్తులకు రోడ్డు సౌకర్యం కల్పించడానికి మేము వ్యతిరేకం కాదని అయితే తమ పట్టా భూమి మధ్యలో రోడ్డు వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారులు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

బోయకొండలో భక్తుల రద్దీ

విశాలాంధ్ర- చౌడేపల్లి: బోయ కొండ గంగమ్మ ను దర్శించుకో వడానికి అధిక సంఖ్యలో ఆంధ్ర కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల నుంచి ఉదయం 6 గంటల నుంచి క్యూలైన్ లందు భక్తులు బారులు తీరారు. ప్రత్యేక దర్శనం టికెట్లు భక్తులతో 200, 500, 1000 రూపాయల టికెట్లు కూడా భక్తులు అధిక సంఖ్యలో కొనుగోలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థంగా తాగునీరు తీర్థప్రసాదాలు అందరికీ అందేలా ఆలయ ఈవో ఏకాంబరం సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. భక్తుల సౌఖ్యార్థం చలువ పందాలను ఏర్పాటు చేసి మంచి పని చేశారని భక్తులు తెలిపారు. భక్తులు అమ్మవారికి ముడుపులు కానుకలు అధిక సంఖ్యలో సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్చక సిబ్బంది వేద పండితులు గోవర్ధన్, ప్రధాన అర్చకులు గంగిరెడ్డి, కృష్ణప్ప ,సుధాకర్ బాబు, దాము, రాజన్న, హరి ప్రసాద్, చిన్న గంగిరెడ్డి ,చంద్ర ఆలయ సిబ్బంది సూపరిడెంట్ రామనాథం కృష్ణారెడ్డి సుధాకర్ రెడ్డి సూరి విజయ తాతయ్య చలపతి భారతి మంజునాథ్ దొరసామి రమణ నారాయణ ముని రాజా సూరి గంగరాజు వెంకటాచలపతి తదితరులు పాల్గొన్నారు.

మహాభారతం ఉత్సవాలు సామాజిక హిత బోధకాలు

మాజీ డిప్యూటీ సిఎం నారాయణ స్వామి

విశాలాంధ్ర- వెదురుకుప్పం: మహాభారతం ఉత్సవాలు సమాజానికి హితాన్ని బోధిస్తాయని మాజీ డిప్యూటీ సిఎం కే నారాయణ స్వామి అన్నారు.ఆదివారం చవటగుంట మహాభారతం ఉత్సవాల్లో భాగంగా ద్రౌపతి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ ధర్మ కర్తలు రాధాకృష్ణ రెడ్డి తీర్థప్రసాదాలు అందించారు.ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వెదురుకుప్పం మండలం లో పలు గ్రామాల్లో మహా భారతం ఉత్సవాలు నిర్వహించడం,తద్వారా భక్తుల మనోభావాలను గౌరవించడం,ప్రశాంతంగా కార్యక్రమాలు నిర్వహించడం సంతోష దాయకం అన్నారు. మరోరకంగా చూస్తే మరుగున పడుతున్న హరికథ,వీధినాటకం కళాకారులను ఈ మహాభారతం ఉత్సవాలు ప్రోత్సహిస్తుండడం ఒక గొప్ప విషయం అన్నారు.ఈకార్యక్రమంలో వైకాపా మండల అధ్యక్షుడు కామసాని పద్మనాభ రెడ్డి,జెడ్పిటిసి సభ్యులు సుకుమార్, నాయకులు హేమసుందర్ రెడ్డి,రామయ్య, చిరంజీవి రెడ్డి, కోలా ప్రకాష్, వెంకటేష్,మునికృష్ణా రెడ్డి,కొండా రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన మహాభారతం ఉత్సవాలు

విశాలాంధ్ర-వెదురుకుప్పం: మండల కేంద్రం పరిధిలోని చవటగుంట లో పది రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్న మహాభారతం ఉత్సవాలు ఆదివారం తో ముగిశాయి.ఈక్రమంలో ఉదయం ద్రౌపతీ సమేత ధర్మరాజు ఉత్సవమూర్తులను ప్రత్యేక అలంకరణ లతో వేదమంత్రాల మధ్య పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం దుర్యోదన వధ నాటక ఘట్టం ను వెంకటేశ్వర నాట్యకళ మండలి కళాకారులు చేసిన ప్రదర్శన భక్తులను అలరించింది.సాయంత్రం ఆలయంలో కంకణాలు ధరించిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు.ఆలయ ధర్మకర్తలు రాధాకృష్ణ రెడ్డి,కమిటీ మండలి సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ ఉత్సవాలు చివరిరోజు సందర్భంగా ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు.స్థానిక ఎస్సై వెంకట సుబ్బయ్య తమ పోలీసు సిబ్బంది తో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉరుములు మెరుపులతో కూడిన వర్షం

విశాలాంధ్ర- నాయుడుపేట: తిరుపతి జిల్లా నాయుడుపేట లో ఒక్కసారిగా ఉరుములు మెరుపులుతో భారీ శబ్దాలతో పాటు భారీ వర్షం కురవడంతో ప్రజలు భయాందోళనకు గురి అయ్యారు. ప్రయాణికులు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బంది కలిగింది. ఆదివారం సెలవు దినం కావడంతో చుట్టుపక్కల పరిశ్రమలు ఉండడంతో కంపెనీల నుంచి వచ్చే చిన్నపాటి ఉద్యోగస్తులు సాయంత్రం పూట కూరగాయల మార్కెట్, మాంసం మార్కెట్కు వస్తుంటారు. ఈ వర్షం వల్ల ఆ వ్యాపారాలకు గండి కొట్టినట్లు అయింది. అంతేకాకుండా ఈ వర్షం వల్ల ఇద్దరు పిడుగు పడి మృతి చెందారు. అందులో ఒకరు ఓజిలి మండలం గ్రద్దగుంట పంచాయతీ గొల్లపాలెం వద్ద మామిడి తోటలో పిడుగుపాటుకు కార్తీక్ అనే బాలుడు మృతి చెందాడు. మరొకరు నాయుడుపేట మండలం ఒద్దిగుంట కండ్రిగ పంట పొలాల్లో పిడుగుపాటుకు గురై అల్లం భాస్కర్ అనే రైతు మృతి చెందారు. వీరి వీరి గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను

సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర -తిరుపతి : వేసవికాలం ఎండల దృష్ట్యా ఈ మే 5 వ తేదీ సోమవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, 9.30 నుండి 10.30 గంటల వరకు నిర్వహించే డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో మే 5వ తేది సోమవారం ఉదయం 9 గంటల నుండి 1 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమం, 9.30 నుండి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208కి కాల్ చేసి మాట్లాడవచ్చుని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ ఎన్.మౌర్య తెలియజేశారు. గమనిక: అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని కమిషనర్ తెలిపారు.

భగీరథునికి కలెక్టరేట్‌లో ఘన నివాళి

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్ : లక్ష్య నిర్దేశంతో సాధన దిశగా చేసే ఏ ప్రయత్నంలోనైనా విజయాన్ని సాధించవచ్చని దివి నుండి భువికి గంగ ను తెచ్చిన భగీరథ మహర్షి పట్టుదల అసామాన్యమని స్ఫూర్తిదాయకం అని జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ జయంతి వేడుకల్లో డిఆర్ఓ ముఖ్య అతిథిగా హాజరై మహర్షి భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం పలువురు భగీరథ మహర్షి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ గంగను దివి నుంచి భువికి ఎంతో పట్టుదలతో తెచ్చిన మహనీయుడు భగీరథ మహర్షి అని అందుకే ఆయన అపర భగీరథుడు అని అన్నారు. ఆ మహనీయుడిని స్మరించుకోవడం, జయంతి వేడుకలు జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. మహనీయుల గొప్పతనాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మహనీయుల జీవిత విశేషాలను ప్రజలకు తెలియజేయాలన్న సత్సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం భగీరథ మహా మహర్షి వేడుకలను రాష్ట్ర వేడుకగా నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. లక్ష్య నిర్దేశంతో సాధన దిశగా చేసే ఏ ప్రయత్నంలోనైనా విజయాన్ని సాధించవచ్చని దివి నుండి భువికి గంగ ను తెచ్చిన భగీరథ మహర్షి పట్టుదల అసామాన్యమని స్ఫూర్తిదాయకం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోత్స్న, లక్ష్మీ నారాయణ, కలెక్టరేట్ సిబ్బంది,బిసి సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పునర్వికాస ఉద్యమంలో

అందరూ భాగస్వామ్యులు కావాలి

విశాలాంధ్ర-పలమనేరు : పట్టణంలో ని ప్రభుత్వ గ్రంథాలయంలో ఆదివారం ఉదయం గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం ప్రత్యేక సదస్సు పలమనేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగింది. గ్రంథాలయాల అభివృద్ధికి గ్రంథాలయాలలో పాఠకుల సంఖ్యను పత్రికలు, పుస్తకాల సంఖ్యను పెంచటానికి తీసుకోవాల్సిన చర్యల గురించి రచయితలు చర్చించారు. గ్రంథాలయ సభ్యత్వ రుసుము ను రచయితలు మిఠాయి యుగంధర్ బాబు, గిరిధర మూర్తి, రైతు నాయకులు ఉమాపతి, రసజ్ఞుల సమాఖ్య అధ్యక్షులు శ్రీపురం సీతారామయ్య గ్రంథాలయాధికారి హేమ కుమార్ కు అందజేశారు. గ్రంథాలయాల అభివృద్ధికి పుస్తకాల సేకరణతో పాటు, ఒక ఉద్యమం లాగా గ్రంథాలయ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పలమనేరు రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు ఆర్. మాధవ్ తెలిపారు. గ్రంథాలయ పునర్వికాసానికి తీసుకోవలసిన చర్యల గురించి రచయితలు జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, చంద్రశేఖరయ్య తదితరులు సూచనలు ఇచ్చారు. యువతరం విలువైన పుస్తకాలను చదవటానికి, తద్వారా వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవటానికి, మానవ సంబంధాలను పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలు తప్పనిసరిగా సందర్శించవలసిన దేవాలయాలు అని పాఠకుల తరపున ప్రసంగించిన డాక్టర్ జయవర్ధన్ అన్నారు. గ్రంథాలయానికి సాహిత్య పత్రికలనుపంపిణీ చేసేందుకు ఐదువేల రూపాయలు చందాను విరాళంగా చెల్లించిన బైరెడ్డిపల్లి మహతి ఫౌండేషన్ వారికి రచయితలు ధన్యవాదాలు తెలిపారు.మరో గ్రంథాలయ ఉద్యమ నేత రచయిత మంచికంటి గ్రంథాలయ వికాసానికి చేపట్టవలసిన చర్యల గురించి రాసిన పరిశోధనాత్మక పుస్తకం సమాజానికి బహిరంగ లేఖ పుస్తకాన్ని ఆర్.మాధవ్ ఆవిష్కరించారు. ప్రజాప్రతినిధులు అధికారులు రచయితలు ప్రజలు విద్యార్థుల భాగస్వామ్యంతో గ్రంథాలయ అభివృద్ధికి నిరంతరం చర్యలు చేపడుతున్నామని తెలియజేస్తూ, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమంలో అందరూ భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి హేమకుమార్ పిలుపునిచ్చారు. ఆరవ తేదీ వరకు విద్యార్థులకు ప్రత్యేక వేసవి శిక్షణా శిబిరం కొనసాగుతుందని ఆయన తెలిపారు.విద్యార్థుల్లో సృజనాత్మక శక్తులను పెంపొందించడానికి సాహిత్య సాంస్కృతిక అంశాలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి వివిధ రంగాలలో పోటీలు నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక నాయకులు మిఠాయి యుగంధర్ బాబు, గిరిధరమూర్తి తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు శ్రీపురం సీతారామయ్య తెలిపారు.

లెర్నింగ్ సెంటర్ ప్రారంభించిన వేదాంతు

విశాలాంధ్ర- తిరుపతి : తన సొంత ప్రాంతం తిరుపతిలో లెర్నింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం ద్వారా రాబోయే రోజుల్లో ఎక్కువ మంది విద్యార్థులకు అందుబాటులో ఉండాలనే విజన్ తో వేదాంతు లెర్నింగ్ సెంటర్ ప్రారంభించినట్లు ఆ సంస్థ సీఈవో వంశీ కృష్ణ తెలిపారు. తిరుపతి న్యూ మారుతి నగర్ లో నూతన లెర్నింగ్ సెంటర్ ప్రారంభం సందర్భంగా ఆదివారం కచిపి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పూర్తి సామర్థ్యాన్ని బయటకు తీసుకువచ్చేది ఉపాధ్యాయుడే. అలాంటి ఉపాధ్యాయుడు అందించే బోధన అద్భుతంగా ఉండాలని బలంగా నమ్ముతోంది వేదాంతు. అందుకే అదే లక్ష్యంతో అభ్యాస నమూనా అత్యాధునిక సాంకేతికత, డేటా-ఆధారిత బోధన, వ్యక్తిగతీకరించిన మార్గదర్శకత్వాన్ని మిళితం చేసి, ప్రభావవంతమైన అభ్యాస అనుభవాలను అందిస్తుంది. భారతదేశం అంతటా 100% ఆఫ్‌లైన్ కేంద్రాల వేగంగా విస్తరిస్తున్న నెట్‌వర్క్ తో, జెఈఈ, నీట్, స్టేట్ బోర్డ్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు వ్యక్తిగతీకరించిన విద్య కోసం వేదాంతు కొత్త బెంచ్‌మార్క్ ను నిర్దేశిస్తోందన్నారు. ఈ సరికొత్త లెర్నింగ్ సెంటర్ ప్రారంభం ద్వారా ఇదే పట్టణం తిరుపతిలో జన్మించిన వేదాంతు సహ వ్యవస్థాపకుడు అయినా తనకు ఇది ఎంతో విశిష్టమైనది. స్థానిక తరగతి గదుల నుండి ఐఐటీ బాంబే వరకు, ఆ తర్వాత భారతదేశంలో అత్యంత గౌరవనీయమైన విద్యా సంస్థలలో ఒకదానిని నిర్మించడం వరకు నా ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తి దాయకం. అన్నింటికి మించి విద్య పవర్ ని ఇది తెలియచేస్తుంది. తిరుపతికి తిరిగి రావడంతో నా జీవితం మళ్లీ పూర్తి వృత్తంలోకి వచ్చినట్లు అనిపిస్తుంది" అని అన్నారు. "ఇక్కడే నా ప్రయాణం ప్రారంభమైంది, ఇవాళ, విద్యార్థులలో సామర్థ్యాన్ని అన్‌లాక్ చేయడానికి, రూపొందించిన నమూనాను తిరిగి తీసుకురావడానికి నేను గర్వపడుతున్నాను. మా అభ్యాస కేంద్రాలు తరగతి గదుల కంటే ఎక్కువ - అవి కలల కోసం లాంచ్‌ప్యాడ్‌లు." అని అన్నారు. గత 18 నెలల్లో, వేదాంతు ఆఫ్‌లైన్ ద్వారా హైదరాబాద్, చెన్నై, విజయవాడ, పాట్నా, కోయంబత్తూర్ ఇప్పుడు తిరుపతితో సహా 35 కి పైగా నగరాలకు విస్తరించింది. ప్రతి కొత్త కేంద్రం వేదాంతు విద్యను ప్రజాస్వామ్యీకరించాలనే దార్శనికతకు దగ్గరగా తీసుకువస్తుంది - దేశవ్యాప్తంగా విద్యార్థులు ఉత్తమ ఉపాధ్యాయులను, అత్యంత వ్యక్తిగతీకరించిన అభ్యాస పద్ధతులను పొందగలరని నిర్ధారిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కీలపట్లలో శాశ్వత విద్యుత్ సమస్య పరిష్కారం

రూ. 60 లక్షల ఖర్చుతో 100 కేవి ట్రాన్స్ ఫార్మర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే అమర్

విశాలాంధ్ర- గంగవరం: మండలంలోని కీలపట్ల పంచాయతీ పరిధిలో విద్యుత్ సమస్య శాశ్వతంగా పరిష్కారానికి నోచుకుందని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. కీలపట్లలోని కోనేటి రాయస్వామి ఆలయంలో స్వామి వారిని ఆదివారం ఆయన దర్శించుకుని పంచాయతీ కేంద్రంలో రూ. 60 లక్షల ఆర్డీఎస్ నిధుల ద్వారా ఏర్పాటు చేసిన నాలుగు 100 కేవి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులతో పాటు విద్యుత్ శాఖ అధికారులు ఆయనకు ఘన స్వాగతం తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన కీలపట్ల గ్రామంలో స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా చేపట్టే ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో విద్యుత్ తీగల కారణంగా ఇబ్బందులు ఉండేవన్నారు. గ్రామస్తులు మరియు భక్తుల శ్రేయస్సు దృష్ట్యా 60 లక్షలతో గ్రామంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటుతోపాటు 100కేవి ట్రాన్స్ఫార్మర్లను మరియు సమస్య అనేదే ఉత్పన్నం కాకుండా ఉండేందుకు అదనంగా 25 కేవి అడిషనల్ ట్రాన్స్ఫార్మర్లు సైతం ఏర్పాటు చేశామన్నారు. దీంతో అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా ఉండడమే కాకుండా లో ఓల్టేజి సమస్య అనే మాటే ఉండదన్నారు. ఈ ప్రాంతంలోని ప్రజల అవసరాలకే గాక 24 గంటలు త్రీఫేస్ విద్యుత్ ను వాడుకోనేందుకు వీలుందన్నారు. దాంతో పాటు పంచాయతీ పరిధిలో చిన్న పరిశ్రమలను సైతం ఏర్పాటు చేసుకోవచ్చని వివరించారు. అతి తక్కువ సమయంలో ఆర్డీఎస్ కాంట్రాక్టర్లు మరియు విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధతో ఈ పనులను పూర్తి చేయడం అభినందించదగ్గ విషయం అన్నారు. కీలపట్ల పంచాయతీ పరిధిలో ఆలయాన్ని టిటిడి పరిధిలోకి తీసుకోవడం, రోడ్లు,గృహాలు, విద్యుత్, తాగునీరు, పాఠశాలలు అన్ని అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే జరిగాయన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ట్రాన్స్ కో ఈఈ శ్రీనివాస మూర్తి, ఏడి చిన్నబ్బు, కన్స్ట్రక్షన్ ఏడి రెడ్డి కుమార్, ఏఈ రామక్రిష్ణ, మరియు టీడీపీ నాయకులు సోమశేఖర్ గౌడ్, ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ చంద్ర శేఖర్, వేణు, గిరిధర్ గోపాల్, రాము,శీనప్ప, శ్రీనివాసులు, జనసేన నాయకులు చంద్ర తదితరులున్నారు.

ప్రశాంతంగా నీట్ పరీక్ష

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని డి. ఆర్. డబ్ల్యు మహిళ కలశాల లో నీట్ పరీక్ష నిర్వహించారు.విద్యార్థిని , విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష హాల్లోకి

అనుమతించారు. ఈ నీట్ పరీక్షను 409 మందికి గాను 398 మంది హాజరైనారు .11 మంది గై హాజరైనారు. గూడూరు డిఎస్పీ గీతా కుమారి ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రం వద్ద ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందో బస్తును ఏర్పాటు చేశారు . తల్లి దండ్రులు తమ పిల్లలను పరీక్షా కేంద్రానికి తీసుకు వచ్చి మనో ధైర్యాన్ని తెలియ చేశారు.

దాసరి నారాయణ రావు 78 జయంతి

విశాలాంధ్ర -తిరుపతి : స్వర్గీయ దర్శకరత్న డాక్టర్ దాసరి నారాయణ రావు 78 జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ తిరుపతి మరియు అన్నమయ్య జిల్లాల కో ఆర్డినేటర్లు, రవిచంద్ర రెడ్డి, నక్కా రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా దర్శకరత్న డా: దాసరినారాయణ రావు సేవలను పలువురు కొనియాడారు. అలాగే ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే కందుకూరి విశిష్ట సేవా పురస్కారం అందుకున్న నాటక మరియు మనసిస్తావా సినిమా నటులు నెల్లూరు కృష్ణమూర్తిని దాసరి జయంతి సంధర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

వైభవంగా ముగిసిన అగ్నిగుండ ప్రవేశం

విశాలాంధ్ర-కార్వేటి నగరం: మండల పరిధిలోని అమ్మపల్లి గ్రామంలో ద్రౌపతి దేవి ధర్మరాజుల స్వామి తిరునాళ్ళు అంగరంగ వైభవంగా ఆదివారంతో ముగిసింది. మధ్యాహ్నం ఒంటిగంటకు దుర్యోధన వద నిర్వహించారు. దుర్యోధన వదను తిలకించడానికి పరిసర గ్రామాల ప్రజలు గ్రామస్తులు హాజరైనారు. రాత్రి 7 గంటలకు శ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గత పది

రోజులుగా ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ దీపాలతో నిండిపోయింది. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తిరునాళ్ళు నిర్వహించారు.

గ్రామోత్సవంలో కురుగొండ్ల

విశాలాంధ్ర-వెంకటగిరి : వెంకటగిరి మండలంలోని వల్లివేడు గ్రామ పంచాయతీ నందు వల్లేడమ్మ తల్లి గ్రామోత్సవంలో పాల్గొన్న వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణతో కార్యక్రమంలో వెంకటగిరి మండల అధ్యక్షు పప్పు చంద్రమౌళి రెడ్డి మాజీ ఏఎంసి చైర్మన్ పులుకులు రాజేశ్వరరావు, పునుగోటి విశ్వనాథం, అవార్ సత్యనారాయణ తోట రామచంద్రయ్య మండల నాయకులు,రాష్ట్ర, తిరుపతి పార్లమెంట్, పట్టణ కమిటీ సభ్యులు,స్థానిక నాయకులు, తెలుగుదేశం – జనసేన బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్ర కార్యక్రమం

విశాలాంధ్ర-వెంకటగిరి : తిరుపతి జిల్లా వెంకటగిరి టౌన్‌లో శ్రీకృష్ణదేవరాయ బలిజ కాపు తెలగ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు రాజా వీధిలో ఉన్న శ్రీ వెంకటేశ్వర టెక్సటోరియం ప్రొప్రైటర్ వెంకటేశ్వర్లు సౌజన్యంతో శ్రీకృష్ణదేవ రాయ బలిజ కాపు తెలగ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర టెక్సటోరియం షాపు ముందర మజ్జిగ కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ తోట కృష్ణయ్య సభ్యులు జ్యోతీశ్వరరావు బీరం రాజు గొల్లగుంట వెంకటముని కందాల తిరుపాలు తిరుపతి గారి ప్రసాద్ గొల్లగుంట రాము సుంకర రవి మల్లు రవీంద్ర నంబి మురళి ఫకీర్ ఆనంద తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారికి వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలిపారు.

రక్తదానంతో ప్రాణదానం

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: రక్తదానంతో ప్రాణదానం చేయ వచ్చని శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో యువతరం సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి విచ్చేసి ప్రారంభించారు. ఈ శిబిరంలో 58 మంది యువకుల విచ్చేసి రక్తదానం చేశారు. రక్తదాతలకు ఆర్డీవో చేతుల మీదుగా సర్టిఫికెట్లను అంద జేశారు. ఈ సందర్భంగా ఆదివారం భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ యువతరం సేవా సమితి వారు గత పది సంవత్సరాలుగా వేసవికాలంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీ యమన్నారు. యువతరం సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ వేసవికాలంలో రక్త కొరతతో ప్రాణాలు విడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వేసవిలో రక్తదానం చేయడానికి వచ్చిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది రాజేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు స్వర్ణమూర్తి, కల్పన యువతరం సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

హెల్పింగ్‌హ్యాండ్స్ సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: వృద్ధులు, దివ్యాంగులకు హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అన్నారు.ఆదివారం హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ వ్యవస్థాపకులు మునీర్‌బాషా ఆధ్వర్యంలో పట్టణంలోని నగరివీధిలో 160 నెల సేవా కార్యక్రమంలో భాగంగా వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ హెల్పింగ్‌హ్యాండ్స్‌సంస్థ నిస్వార్థంగా పేదలకు సేవలు అందిస్తోందన్నారు. ఈ సంస్థ మరిన్ని సేవలు అందించేందుకు నియోజకవర్గంలోని పరిశ్రమలతో చర్చించి సీఎస్ఆర్ ఫండ్ ద్వారా ఈ సంస్థ అభివృద్ధి చెందే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ సంస్థకు తన వంతుగా ఉడతాభక్తిగా రూ.లక్ష విరాళం అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పేదవారిఇ ఆదుకోవడానికి తమ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికీ పింఛనుదారులకు 1వ తేదీనే పింఛను అందిస్తున్నట్లు తెలిపారు. పేదలకు సాయం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.4వేలు పింఛను అందించిన ఘనత సీఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలోని ధనికులు హెల్పింగ్‌హ్యాండ్స్ వ్యవస్థాపకులు మునీర్‌బాషాను ఆదర్శంగా తీసుకుని పేదలకు తమ వంతు సేవాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తల్లి బృందమ్మ, సతీమణి రిషితారెడ్డి, టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నాయకులు చెంచయ్యనాయుడు, ఉమేష్ రావు, నివేదితమోరె, నెమళ్ల సుబ్రహ్మణ్యం, సంస్థ సభ్యులు గరికపాటి రమేష్‌బాబు, బాబా ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు పాడి గేదె మృతి

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం ఉరుములు , మెరుపులతో కూడిన వర్షానికి పిడుగు పడి ,చెన్నూరు గ్రామానికి చెందిన చెన్నూరు శ్రీనివాసులు కి చెందిన గేదె మృతి చెందింది.సుమారు దీని విలువ 40 వేల వరకు ఉంటుందని పాడి రైతు శ్రీనివాసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి.. మరొకరికి గాయాలు

విశాలాంధ్ర-తడ : మండల పరిధిలోని వాటంబేడు గ్రామంలో జరుగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకి మోటార్ సైకిల్ పై వెళ్లి వస్తూ అదుపు తప్పి క్రింద పడటంతో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలు పాలైన సంఘటన చోటుచేసుకుంది. తడ ఎస్సై కొండప నాయుడు సమాచారం మేరకు రాష్ట్ర సరిహద్దు గ్రామమైన ఆరంభం బాటకుప్పానికి చెందిన దేశప్పన్(14) ఈనెల 29వ తేదీన వాటం బేడు గ్రామంలో జరుగుతున్న ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలకు వారి బంధువులు ఇంటికి వచ్చి అతని స్నేహితుడైన శివలింగంను మోటార్ సైకిల్‌పై సూళ్లూరుపేటకు బయలుదేరగా మోటార్ సైకిల్ అదుపుతప్పి జారి క్రింద పడడంతో దేశప్పన్ ,శివలింగంకు తీవ్ర గాయాలు కావడంతో వారిద్దరిని సూళ్లూరుపేట వీనస్ ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన చికిత్స కోసం చెన్నై రాజీవ్ గాంధీ గవర్నమెంట్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ దేసప్పన్ శనివారం మృతి చెందాడని అతని స్నేహితుడు శివలింగం స్టాండ్లీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని మృతుని తండ్రి కుప్పరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అన్నారు. ఊరందూరులోని తన స్వగృహంలో ఆదివారం సమస్య పరిష్కార దిశగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి మాట్లాడుతూ గతప్రభుత్వం నియోజకవర్గంలో సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ప్రజా సమస్యలపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. తాను నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి సమ స్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. పలు సమస్యలను కూడా పరిష్కరించినట్లు తెలిపారు. అనంతరం ప్రజల నుంచి సమస్యలపై వినతులను స్వీకరించారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య భద్రత లోపం వల్లే కార్మికుడు మృతి

విశాలాంధ్ర-సత్యవేడు: స్ప్రేరీ కంపెనీ యాజమాన్య భద్రత లోపం కారణంగానే కార్మికుడు మృతి చెందినట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మెలుగు రమేష్ ఆరోపించారు. మండలంలోని పాలగుంట గ్రామంలో ఉన్న స్ప్రేరీ కంపెనీలో శుక్రవారం రాత్రి బ్రాయిలర్లో పడి ఉత్తర ప్రదేశ్కు చెందిన వలస కార్మికుడు ఫారన్(22) మృతి చెందటం బాధాకరమన్నారు.సంబంధిత యాజమాన్యం కంపెనీలో కార్మికులకు ఎలాంటి భద్రత చర్యలు చేపట్టకపోవడంతో కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయన్నారు. మృతికి స్ప్రేరీ కంపెనీ యాజమాన్యం పూర్తి బాధ్యత వహించి కార్మికుడు ఫారన్ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులపై నిర్లక్ష్యం వీడి ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా కంపెనీ యాజమాన్యం భద్రతా ప్రమాణాలు పటిష్టం చేయాలని తెలిపారు. కంపెనీ యాజమాన్యం, ప్రభుత్వం కార్మికుడి కుటుంబాన్ని వెంటనే ఆదుకోని న్యాయం చేయాలని లేకుంటే బాధితుల పక్షాన కార్మిక లోకం పెద్ద ఎత్తున నిరసనలు చేపడుతామని హెచ్చరించారు.

తిరుపతిలో స్కిల్‌వేద కొత్త బ్రాంచ్ పారంభం

విశాలాంధ్ర - తిరుపతి : భారత్‌లో వేగంగా ఎదుగుతున్న ఎడ్టెక్ సంస్థలలో ఒకటైన స్కిల్‌వేద తన నూతన శాఖను తిరుపతిలో ఘనంగా ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవానికి పలు ప్రముఖులు హాజరై సందేశాల రూపంలో తమ ఆశీస్సులు అందించారు. ప్రారంభ కార్యక్రమానికి పొకల అశోక్ కుమార్ మాజీ టీటీడీ బోర్డు సభ్యులు, ముఖ్య అతిథిగా హాజరై దీపప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి ఓ ఆధ్యాత్మిక క్షేత్రం మాత్రమే కాకుండా ప్రతిభావంతుల నగరం. ఇలాంటి ప్రాంతాల్లో విద్యను ప్రజలకందించే ప్రయత్నం అభినందనీయం. స్కిల్‌వేద తరహా ప్లాట్‌ఫామ్స్ యువతకు ఉత్తమ భవిష్యత్తును అందిస్తాయి." అని అన్నారు.ప్రముఖ గాయని ఉషా కూడా ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ సంగీతం లాగే విద్య కూడా మనల్ని మార్చే శక్తివంతమైన సాధనం. స్కిల్‌వేద నూతన విద్యా మార్గాలను అందిస్తూ, సమాజానికి ఉపయుక్తమైన మార్గాన్ని చూపుతోంది. ఇది ఎంతో సంతోషకరమైన విషయం." అని తెలిపారు. స్కిల్‌వేద సందీప్ అవుటపల్లి మాట్లాడుతూ టెక్నాలజీ ఇప్పుడు విలాసం కాదు, అవసరం. స్కిల్‌వేద ద్వారా దేశంలోని ప్రతి విద్యార్థికి అవసరమైన డిజిటల్ వనరులు, ప్రాక్టికల్ స్కిల్స్, కారీర్ గైడెన్స్ అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. తిరుపతి శాఖ ఆ దిశగా ఓ పెద్ద అడుగు." అని అన్నారు.స్కిల్‌వేద దనుష్ కుమార్ మగ్రపు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితం నెమ్మదిగా మారాలి అనేది మా ఆశయం. ఈ బ్రాంచ్ ప్రాంతీయ స్థాయిలో శిక్షణ, నూతన ఆవిష్కరణలకు కేంద్రంగా నిలుస్తుంది." అని తెలిపారు.స్కిల్‌వేద డైరెక్టర్లు ప్రమీల్ అర్జున్ మరియు సందీప్ అవుటపల్లి ఈ అవకాశాన్ని పురస్కరించుకుని అతిథులకు, తిరుపతి ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. వారు సంస్థ ముఖ్య ఉద్దేశాన్ని మరోసారి గుర్తుచేశారు అందరికీ ప్రామాణిక, నైపుణ్యాత్మక విద్యను అందించడమే.కార్యక్రమం అనంతరం శిక్షకులు, విద్యార్థులు మరియు సంఘం ప్రముఖులతో జరిగిన ఇంటరాక్షన్‌లో డిజిటల్ విద్య ప్రాధాన్యతపై చర్చలు కొనసాగాయి.స్కిల్‌వేద విద్యను ప్రజల ఇంటి వద్దకే తీసుకెళ్లే లక్ష్యంతో ముందుకు సాగుతుంది అని తెలిపారు.

భగవాన్ శ్రీ సత్య సాయి బాబా ఆరాధన మహోత్సవాలు

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని కుమ్మరి వీధిలో ఉన్న ప్రేమ సుధ సత్య సాయి మందిరం నందు భగవాన్ శ్రీ సత్య సాయి బాబా ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని సమితి కన్వీనర్ దామ ప్రతాప్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్య సాయి బాబా 24.4.2011 వ తేదిన తనువు చాలించారని అప్పటి నుండి ప్రేమ సుధ మందిరంలో కొన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలు తోటి యువత, చిన్నారులకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు.ప్రస్తుతం సమ్మర్ క్యాంపు ను ఉదయం 6.30 నుండి 10.30 వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ తరగతుల్లో జ్యోతి ధ్యానము, యోగ క్లాసులు, సూర్య నమస్కారాలు, వేద ధ్యాయనము, చెస్, వినోదాత్మక పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎస్.ఎస్ సొసైటీ జాయింట్ సెక్రటరీ ఎస్.ఎల్.వి సురేష్ బాబు, బాల వికాస్ గురువులు గౌతమి, సునంద, సేవా దల్ ఇన్చార్జి మల్లిఖార్జున రావు, సుబ్బారావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బిఎన్ కండ్రిగలో కార్డన్ సెర్చ్

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని అరుంధతి వాడలో ఆదివారం ఎస్సై విశ్వనాథ నాయుడువాహన తనిఖీల్లో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకై అక్రమ కార్యక్రమాలకు కళ్లెం వేసేందుకు ఈ కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అరుంధతివాడలో ప్రతి ఇంటికి వెళ్లి వాహనాలను పరిశీలించారు. కార్డన్ సెర్చ్‌లో సుమారు రెండు బైకులు,అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. కొంతమంది యువకులు చోరీకి గురైన వాహనాలను కొనుగోలు చేసి ధ్రువపత్రాల లేకుండా నడుపుతున్నారన్నారు. వాహనాలకు సంబంధించిన ధ్రువ పత్రాలను పరిశీలించి వాటిని విడుదల చేశారన్నారు. మైనర్లకు బైకులు ఇస్తే వాహన యజమానులపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని తెలిపారు. మద్యం తాగి వాహనాలను నడిపితే వారిపై కూడా కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ పాల్గొన్నారు.

అకాడమిక్ ఎక్సలెంట్ అవార్డు అందుకున్న ఆర్‌కె అబాకస్

విశాలాంధ్ర - తిరుపతి : అకాడమిక్ ఎక్సలెంట్ అవార్డును ఆర్‌కె అబాకస్ తరపున సంస్థ వ్యస్థాపకులు డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి అందుకున్నారు. హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్‌లో ఎఎఎ (ట్రిపుల్ ఎ) అబాకస్ వారి ఆధ్వర్యంలో అంగుల్లియా అర్థమేటిక్స్ పైన శిక్షణ అనంతరం 20వ ఇంటర్నేషనల్ అబాకస్ కాంపిటేషన్స్ నిర్వహణకు ట్రిపుల్ ఎ ఇన్స్టిట్యూషన్స్ ఫౌండర్ గంగాధర్‌ను ఆహ్వానించినట్లు అబాకస్ సంస్థ డైరెక్టర్ ఆర్.కె విమల తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగాధర్‌తో పాటు తిరుపతి ఆర్. కె అబాకస్ ఎడ్యుకేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి పాల్గొని అకాడమిక్ ఎక్సలెంట్ అవార్డు ను అందుకున్నారు. రాబోయే రోజుల్లో సైనిక్ నవోదయ కాంపిటీషన్ ఎగ్జామ్స్ పై దృష్టితో అంగులియా అర్థమెటిక్ అబాకస్ శిక్షణ తిరుపతి నందు కూడా ప్రారంభిస్తే బాగుంటుందని ప్రధాని నరేంద్ర మోడీ కూడా వేదిక్ మ్యాథమెటిక్స్, వేద అబాకస్ పై అవగాహన కలిగి ఉండాలని, శిక్షకులకు విద్యార్థులకు ఢిల్లీలో కార్యక్రమంలో తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా గణితంలో పట్టు ఉంటే ఏ సబ్జెక్ట్ అయినా అవలీలగా చేయగలరని వరల్డ్ అబాకస్ ట్రైనర్ గంగాధరం తెలిపారు. తిరుపతి నందు కూడా ఆర్. కె అబాకస్ సంస్థ ఆధ్వర్యంలో 10 చేతివేళ్లతో క్యాలిక్యులేటర్ కంటే వేగంగా లెక్కలు చేయడం, చేతివేళ్లలో 1 నుండి 1000 మల్టిప్లికేషన్ టేబుల్స్ ను పెన్ను పేపర్ లేకుండ విథిన్ సెకండ్స్‌లో చెప్పగలరు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా బీసీ జనరల్ సెక్రటరీ అనగాని రెడ్డెప్ప, ఆర్. కె అబాకస్ సభ్యులు అశోక్ రెడ్డి, కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

బీద రవిచంద్రను సన్మానించిన గంగోటి

విశాలాంధ్ర - వెంకటగిరి : నెల్లూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్‌గా నియమితులైన గంగోటి నాగేశ్వర రావు శాసనమండలి సభ్యులు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర నెల్లూరు నగరం, మాగుంట లే అవుట్‌లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గంగోటికి బీద శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీదను గంగోటి నాగేశ్వర రావు శాలువా తో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు.

రాష్ట్ర వైద్య మండలి చైర్మన్‌గా డాక్టర్ శ్రీహరి

విశాలాంధ్ర-తిరుపతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య మండలి చైర్మన్ గా ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరి నియమి తులయ్యారు. గతంలో రాష్ట్ర వైద్య మండలి వైస్ చైర్మన్‌గా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడిగా, అకాడమీ ఆఫ్ స్పెషాలిటీ చైర్మన్ గా, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా, ఏపీ నర్సింగ్ హోమ్ అండ్ హాస్పిటల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఆయన మర్యాదపూర్వకంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, పలువురు పాల్గొని మంత్రి సత్య కుమార్‌ను ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవి ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు.

ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి: కమిషనర్ ఎన్.మౌర్య

విశాలాంధ్ర-తిరుపతి : తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో సోమవారం నుండి ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డులో తప్పులు సరిదిద్దుకోవడం కోసం మరియు కొత్త ఆధార్ నమోదు 5 నుండి 8వ తేదీ వరకు, అలాగే 12 నుండి 15 వ తేదీ వరకు 12 సచివాలయాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. దొడ్డాపురం వీధి-01, ఐ.ఎస్ మహల్ రోడ్-02, జర్నలిస్ట్‌కాలనీ-01, కెనడీ నగర్-01, మధురానగర్-1,2, పోస్టల్ కాలనీ-04, ప్రకాశంరోడ్-02, రాజీవ్ నగర్ జీవకోన-06, శంకర్ కాలనీ -01, రేణిగుంట రోడ్-1, రాజీవ్ నగర్ జీవకోన-03, చెన్నారెడ్డి కాలనీ -03 నందు ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఆ ప్రకటనలో కోరారు.

మాజీ ఎంపీపీ రాజారెడ్డి చిత్రపటానికి నివాళి

విశాలాంధ్ర-తిరుపతి: గంగాధర నెల్లూరు మండల సీనియర్ నాయకులు మొట్టమొదటి ఎంపీపీ రాజారెడ్డి గత కొద్ది రోజుల క్రితం మృతి చెందగా ఆదివారం కర్మ క్రియల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి రాజారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. మండలాన్ని ప్రగతి పథంలో నడిపించిన ప్రముఖులలో రాజారెడ్డి ఒకరని, రాజారెడ్డి సేవలు ఎనలేనివని గుర్తు చేసుకున్నారు. అదేవిధంగా సత్యవేడు నియోజకవర్గ ఇన్చార్జి రాజేష్ రాజారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, రఘునాథరెడ్డి, శ్రీరాములు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

హలో యువత చలో తిరుపతి

ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కత్తి రవి పిలుపు

విశాలాంధ్ర-చిత్తూరు: తిరుపతి నగరంలో జరగబోయే 17వ ఏఐవైఎఫ్ జాతీయ మహాసభ లను జయప్రదం చేయాలని స్థానిక చిత్తూరు జిల్లా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కార్యాలయం వద్ద వాల్ పోస్టర్లను విడుదలయువతి యువకులు తరలివచ్చి తిరుపతిలో జరగబోయే జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కత్తి రవి పిలుపునివ్వడం జరిగిందిఅఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐజిల్లా కార్యదర్శి యన్.నాగరాజు ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కత్తి రవి మాట్లాడుతూ స్థానిక చిత్తూరు నగరం లో సిపిఐ పార్టీ కార్యాలయంలో ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 15 నుంచి 18 వరకు చారిత్రాత్మక నగరమైన తిరుపతిలో మొట్ట మొదటి సారిగా అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ మహాసభలు జరగబోతున్నాయన్నారు. ఈ మహా సభలు చాలా ప్రాధాన్యతతో కూడుకున్నవని,దేశంలోని మొత్తం 29 రాష్ట్రాల నుండి యువజన సమాఖ్య ప్రతినిధులు వస్తున్నారని, వేలాది మంది, యువతి, యువకులు తిరుపతి నగరంలో జరిగే భారీ ర్యాలీలో కదం తొక్కబోతున్నారని,సుమారు వెయ్యి మంది ప్రతినిధులతో సభ మూడు రోజుల పాటు ఈ మహాసభలు జరుగుతాయన్నారు. దేశంలో పేరుకుపోతున్న నిరుద్యోగం, అశాంతి, ప్రాంతీయ, మత తత్వ విధానాలు, జాతీయ విద్యా విధానం, ఉపాధి తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, భవిష్యత్ కార్యాచ రణను రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. విద్యార్థులు, యువకులు ఈ మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్, మల్లికార్జున, నాగచైతన్య, రంగారావు, యశ్వంత్, ఏఐవైఎఫ్ నాయకులు హెచ్ బాలాజీ రావు, మణిరాజన్,జానకిరామ్ శ్రీనివాసులు, మహేష్, నాగేంద్రబాబు, శ్రీనివాస్, గిరిబాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ కట్ లేని పట్టణంగా నాయుడుపేటను తీర్చిదిద్దుతా

విశాలాంధ్ర-నాయుడుపేట: తిరుపతి జిల్లా నాయుడుపేట మున్సిపాలిటీలో విద్యుత్ సమస్యలు పరిష్కారానికి విద్యుత్ శాఖ శ్రీకారం చుట్టింది. మున్సిపాలిటీలో 18 ట్రాన్స్‌ఫర్మ్ లు, 11 కేవీ ఫీడర్‌ను 88 లక్షల వ్యయంతో సూళ్లూరుపేట శాసనసభ్యులు నెలవల విజయశ్రీ ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కారించడంలో రాజీ లేకుండా పనిచేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. పవర్ కట్ లేని పట్టణంగా నాయుడుపేటని మార్చడానికి విద్యుత్ శాఖ అధికారులు కృషి చేస్తున్నారని డిఈఈ శ్రీనివాసులు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంటు సభ్యులు సూళ్లూరుపేట తెలుగు దేశం పార్టీ ఇంచార్జ్ నెలవల సుబ్రమణ్యం, మాజీ ఏయంసి చైర్మన్ శిరసనంబేడు విజయభాస్కరరెడ్డి, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ, చంద్రారెడ్డి, న్యాయవాది తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పసల గంగాప్రసాద్, ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

దుర్గా మృతిపై న్యాయ విచారణ జరిపిస్తాం

మంత్రి కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర-చిత్తూరు: నగరంలోని బీసీ నేత షణ్ముగం కుమార్తె టిడిపి మహిళా నేత దుర్గా మృతి పై న్యాయ విచారణ జరిపిస్తామని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. గత నెల 21 తేదీన దుర్గ రోడ్డు ప్రమాదం గురై చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తదుపరి దుర్గా మరణించిన సంగతి తెలిసిందే. తన కుమార్తె మృతికి చిత్తూరు ఆసుపత్రిలోని అపోలో వైద్యుల కారణమని బీసీ నేత షణ్ముగం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఆదివారం మంత్రి కొల్లు రవీంద్ర మరణించిన దుర్గ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టిడిపి నాయకురాలు దుర్గ మరణానికి చిత్తూరు ఆసుపత్రిలోని అపోలో వైద్యుల నిర్లక్ష్యమే కారణమన్న ఆరోపణలపై సమగ్రంగా న్యాయ విచారణ జరిపిస్తామని తెలిపారు. దుర్గా కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చిత్తూరు పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు రాజన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్ష కు 67.95 శాతం హాజరు

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు

విశాలాంధ్ర-తిరుపతి: ఆదివారం ఉదయం ఏపీపీఎస్సీ గ్రూప్-1, మెయిన్స్ రాత పరీక్ష కేంద్రాలను జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు ఆకస్మిక తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఏపీపీఎస్సీ గ్రూప్-1, మెయిన్స్ రాత పరీక్షలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం జరిగిందని, అలాగే పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరం, త్రాగునీరు, మౌలిక సదుపాయాలు ఏర్పాట్లను చేయడం జరిగిందని తెలిపారు. వేసవి ఎండల దృష్ట్యా పరీక్షలు రాసే విద్యార్థులు అస్వస్థకు గురికాకుండా తక్షణం వైద్య సేవలు అందించేందుకు ఓఆర్ఎస్, అత్యవసర మందులు అందుబాటులో ఉంచామని తెలిపారు. జిల్లాలో నేటి ఏపీపీఎస్సీ గ్రూప్-1, మెయిన్స్ రాత పరీక్షలకు మొత్తం 911 మంది అభ్యర్థులకు గాను 619 (67.95 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారని, 292 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల గోడ పత్రిక ఆవిష్కరణ

ఏఐవైఎఫ్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు డి.మహేష్ పిలుపు

విశాలాంధ్ర-పుత్తూరు: తిరుపతి నగరంలో జరగబోయే 17వ ఏఐవైఎఫ్ జాతీయ మహాసభ లను జయప్రదం చేయాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్ వద్ద వాల్ పోస్టర్లను విడుదల చేశారు. యువతి యువకులు తరలివచ్చి తిరుపతిలో జరగబోయే జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు డి మహేష్ పిలుపునివ్వడం జరిగింది. అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్)జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని డి మహేష్ మాట్లాడుతూ ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలకు సంబంధించిన పోస్టర్లను పుత్తూరు మండల అధ్యక్షులు దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 15 నుండి 18 వరకు చారిత్రాత్మక నగరమైన తిరుపతిలో మొట్ట మొదటి సారిగా అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ మహాసభలు.జరగబోతున్నాయన్నారు. ఈ మహా సభలు చాలా ప్రాధాన్యతతో కూడుకున్నవని, దేశంలోని మొత్తం 29 రాష్ట్రాల నుండి యువజన సమాఖ్య ప్రతినిధులు వస్తున్నారని, వేలాది మంది యువతి, యువకులు తిరుపతి నగరంలో జరిగే భారీ ర్యాలీలో కదం తొక్కబోతున్నారని, సుమారు వెయ్యి మంది ప్రతినిధులతో సభ మూడు రోజుల పాటు ఈ మహాసభలు జరుగుతాయన్నారు. దేశంలో పేరుకుపోతున్న నిరుద్యోగం, అశాంతి, ప్రాంతీయ, మత తత్వ విధానాలు, జాతీయ విద్యా విధానం,ఉపాధి తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి,భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. యువతను నిర్వీర్యం చేస్తున్న మద్యం, గంజాయి, డ్రగ్స్, ఇతర అసాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేసిందని దేశాన్ని క్యాన్సర్ల పట్టిపీడిస్తున్న అవినీతి లంచగొండి తనని కురుపుమాపడానికి బీఅవినీతి అంతం -ఏఐవైఎఫ్ పంతంగాబీ నపతం చేసినిర్మి పోరాటాలను. కొనసాగిస్తున్నదని విద్య వైద్యం ఉపాధి హక్కుల సాధన కోసం పోరాటం చేస్తుందని తెలిపారు. పుత్తూరు డివిజన్ పరిధిలో విద్యార్థులు, యువకులు ఈ మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు భార్గవ్, వినోద్, పొన్ను స్వామి, మనోజ్, ప్రదీప్, రఘు తదితరులు పాల్గొన్నారు.